# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

ఆదివారం | 8 సెప్టెంబర్ 2024 | పేజీలు 8




హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ ఐపీఎస్..

- రేపటి నుంచి బుద్ధ భవన్‌లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు..
- నాలా కబ్జాలపై ఫిర్యాదులు ఉంటే ఇవ్వాలని హైడ్రా పిలుపు..
- భారీ వర్షాలు, వరద విపత్తులు.. ముంపు ప్రాంతాల ప్రజల ఇబ్బందులతో 'హైడ్రా' కీలక నిర్ణయం..

# నాలా ఆక్రమణలపై..

# 'హైడ్రా' నజర్

## సమాచారం ఇవ్వండి.. సహకరించండి..

మాధవ్ పత్తి,
పెన్ పవర్, సెప్టెంబర్ 7:

తక్కువ సమయంలో ఎక్కువ వర్షపాతం నమోదై, రహదారులు జలమయం, నాలాల పరిసర కాలనీలు, బస్తీలు నీట మునుగుతున్న నేపథ్యంలో, హైడ్రా కీలక నిర్ణయం తీసుకుంది.. నాలా నిర్వహణలో భాగంగా ఆక్రమణలను తొలగించే ప్రక్రియను వేగవంతం చేసేందుకు..! హైడ్రా ప్రత్యేక ప్రణాళికను రూపొందించింది.. ఇందుకోసం ఫిర్యాదులను స్వీకరించేందుకు బుద్ధభవన్ హైడ్రా కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటుకు సిద్ధం చేశారు.. రేపటి నుండి (సోమవారం) ఫిర్యాదులు స్వీకరిస్తారు.. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) వరద నీటి నిర్వహణపై దృష్టి సారించింది.. ఇప్పటి వరకు చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలపై క్షేత్రస్థాయి పరిశీలనతో చర్యలు చేపడుతున్న 'హైడ్రా', "ఆపరేషన్ నాలా" విస్తరణ ప్రక్రియ ప్రారంభానికి శ్రీకారం చుట్టింది.. నాలా ఆక్రమణలతో వరద నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న నిర్మాణాల తొలగింపునకు రంగం సిద్ధం చేస్తోంది. నాలాలకు అడ్డుగా ఉన్న, కబ్జా చేస్తు చేపట్టిన నిర్మాణాలకు సంబంధించిన సమాచారం ఇవ్వాలని ఆయా ప్రాంతాల ప్రజలను కోరుతోంది. జీహెచ్‌ఎంసీ తోపాటు ఔటర్ రింగ్‌రోడ్డు వరకు ఉన్న ఏరియాల్లో నాలాల విస్తరణకు ప్రస్తుతం ప్రాధాన్యతను ఇస్తున్నట్టు సమాచారం..!

-2లో



నాలాపై నిర్మిస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తున్న అక్రమ కట్టడం..



అపార్ట్‌మెంట్ ఎదురుగానే ఫాక్స్‌సాగర్ నాలాపై మరో కొత్త అపార్ట్‌మెంట్..

ఫాక్స్‌సాగర్ చారిత్రక నాలా కబ్జాలో అపార్ట్‌మెంట్..

## బయ్యారం మండలం లో ఉరుములుతో కూడిన భారీ వర్షం..



మహబూబాబాద్ పెన్ పవర్: మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. మహబూబాబాద్, కేసముద్రం, గూడూరు, నెల్లికుదురు, గార్ల, బయ్యారం మండలాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. మహబూబాబాద్

-3లో

## మరోమారు పొంచి ఉన్న ముంపు ముప్పు...!


- మున్నేరు పరివాహక ప్రజలు బీ అలర్ట్..
- అధికారులూ అప్రమత్తంగా ఉండండి
- రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ఫోన్ ద్వారా రెండు జిల్లాల కలెక్టర్ల తో మాట్లాడి పరిస్థితి సమీక్ష

-3లో




# నాలా ఆక్రమణలపై.. 'హైడ్రా' నజర్..

















ఫాక్స్‌సాగర్ నాలా విస్తరణపై 2018లో మూడు శాఖల సర్వే స్కెచ్‌మ్యాప్..





బహుదూర్‌పల్లిలోని నాలా ఆక్రమణలో హైరైజ్ టవర్‌లు..

## తాజా భారీ వర్షాలతో నాలా ఆక్రమణలపై 'హైడ్రా' అప్రమత్తం..

జీహెచ్ఎంసీ పరిధిలోని మేజర్ నాలాలు, వరద నీటి కాలువల ప్రవాహ వ్యవస్థ సామర్థ్యాన్ని మించి కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని.. హైదరాబాద్ నగరాభివృద్ధికి, ప్రజల ఇబ్బందులకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం నాలా ఆక్రమణ తొలగింపు ప్రక్రియను చేపట్టినట్లు సమాచారం.. ఇందులో భాగంగా నాలాల విస్తరణకు నగర పౌరులు సహకరించాలని హైడ్రా కమిషనర్ కోరుతున్నారు.. ఫిర్యాదులు ఇవ్వడానికి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు.. దీర్ఘకాలంగా ఉంటున్న ప్రజలకు ఇబ్బంది లేకుండా నివాసేతర నిర్మాణాలను మాత్రమే తొలగించాలని నిర్ణయించారు. గతంలో జీహెచ్ఎంసీ నిర్వహించిన సర్వేలో నగరంలోని నాలాలపై వేలకుపైగా ఆక్రమణలు ఉన్నట్లు గుర్తించారు.. ఇందులో దాదాపు 35 శాతం వరకు నివాసేతర నిర్మాణాలు నాలా ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు.. బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు సైతం ఉన్నాయి..

## కుంచించుకు పోయిన నాలాలు.

ఏడాదికి ఏడాది నాలలు కుంచించుకు పోవడం నగర వాసులను కలవర పెడుతోంది.. సుమారు 125 ఏళ్ల క్రితమే, భవిషత్తులో హైదరాబాద్ నగర విస్తరణను దృష్టిలో ఉంచుకుని.. ప్రధాన నాలాలు మూసీనదికి అనుసంధానంగా నాలాల నిర్మాణం చేపట్టినట్లు నేటికీ ఆనవాళ్ళు ఉన్నాయి.. ఈ చారిత్రక నాలాలు నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలోనే రోజు రోజుకు కుదింపుకు గురవుతున్నాయని విమర్శలు లేకపోలేదు.. కొన్నిచోట్ల 30 అడుగుల వెడల్పు ఉన్న నాలాలు.. పది అడుగుల లోపుకు కుంచించుకు పోయాయి.. మరికొన్ని చోట్ల నాలాలు రెండు, మూడు అడుగుల కంటే వెడల్పు లేకపోవడం, దీంతో పరిసర ప్రాంతాలు ముంపుకు గురై వరద విపత్తులు సంభవిస్తున్నాయి.. నాలాల విస్తరణకు కోట్ల రూపాయలతో గతంలోనే ఓ ప్రణాళికను రూపొందించినట్లు సమాచారం..




ప్రైమార్క్ హైరైజ్ టవర్‌ల కింద.. భూ స్థాపితం అయిన నాలా.. ఫైల్ ఫోటో..

## చారిత్రక ఫాక్స్‌సాగర్ నాలాపై.. బహుళ అంతస్తులు..

కుత్బుల్లాపూర్ సర్కిల్-25 పరిధిలోని జీడిమెట్ల ఫాక్స్‌సాగర్ చెరువు 1897-99 లో నిర్మించిన చారిత్రక కట్టడం ఆక్రమణ వలయంలో చిక్కుకుంది.. దీంతో పాటు మూసీనదికి అనుసంధానంగా ఒకప్పుడు 200 ఫీట్ల వెడల్పుతో సర్‌ప్లస్ నీరు ప్రవహించే నాల కాలక్రమేణా కుంచించుకు పోయిందని జీడిమెట్ల వాసులు చెబుతుంటారు.. 2018లో ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ ఉమ్మడి సర్వేలో..! నాలా 30 మీటర్ల (100 ఫీట్లు) వెడల్పుతో, రెండు వైపులా 9 మీటర్లు (30 ఫీట్లు) బఫర్ ఉన్నట్లు మూడు శాఖలు సర్వేలో తేల్చినట్లు స్కెచ్‌మ్యాప్ చూపిస్తుంది.. ఇదంతా అధికారిక లెక్కలు.. ఈ చారిత్రిక ఫాక్స్‌సాగర్ నాలా కబ్జాకు, ఓ మాజీ మంత్రితో పాటు, ఇద్దరు శాసన సభ్యులు సిఫార్సులు ఉన్నట్లు అనధికారిక సమాచారం.. అయినప్పటికీ నిర్మాణాలు పరిశీలిస్తే జీహెచ్ఎంసి, ఇరిగేషన్, రెవెన్యూ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది.. కానీ సిఫార్సులకు తలొగ్గి జీహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ కూడా జారీ చేసింది.. సంబంధిత అధికారులు, అక్రమార్కులు కుమ్మక్కై ప్రజలను వరద ముంపుకు గురిచేస్తున్నారని సర్వత్రా ఆరోపణలు వస్తున్నాయి.. జీడిమెట్ల సచిత్ర దారిలోని ఈ రెండు నిర్మాణాలను హైడ్రా అధికారులు పరిశీలిస్తే "కబ్జాదారులకు- అధికారులకు" ఉన్న అవినాభావ సంబంధం బట్టబయలు అవుతుంది.. కేవలం ఇవి కళ్ళముందు ఉన్నవిమాత్రమే ఇక ఫాక్స్‌సాగర్ నాలా పరిశీలిస్తే కోకొల్లలు.. మరో ప్రధాన చారిత్రక సర్‌ప్లస్ వాటర్ ప్రవాహ నాలా "కోల్‌నాలా" కబ్జాదారులకు అనుకూలంగా దారి మళ్ళింపును హైడ్రా అధికారులు పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు..

# మరోమారు పొంచి ఉన్న ముంపు ముప్పు...!



**ఖమ్మం, పెన్ పవర్, సెప్టెంబర్ 7:** వరుణుడు మరోమారు తన ప్రతాపాన్ని చూపించే అవకాశం ఉందని వాతావరణ

## మున్నేరు పరివాహక ప్రజలు బీ అలర్ట్..
## అధికారులూ అప్రమత్తంగా ఉండండి
## రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
## ఫోన్ ద్వారా రెండు జిల్లాల కలెక్టర్ల తో మాట్లాడి పరిస్థితి సమీక్ష

శాఖ అధికారులు హెచ్చరించిన నేపథ్యంలో మున్నేరు పరివాహక ప్రాంతవాసులు అందరూ ముందస్తు జాగ్రత్తగా ఉండాలని తెలంగాణ రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. శనివారం సాయంత్రం నుంచి మళ్ళీ ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్న నేపథ్యంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్ల తో మాట్లాడి తాజా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మున్నేరు తో పాటు ఇతర ప్రాంతాల ముంపు బాధితులను పరిస్థితిని అంచనా వేసి పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. ఆయా నియోజకవర్గ, మండలాల అధికారులను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ప్రజలు కూడా అధికారులకు సహకరించాలని కోరారు. ఆహార పానీయాలకు కూడా ఏటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సూచించారు. రోడ్ల పై వాహనాల రాక పోకల పైనా శ్రద్ధ వహించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు.

# వరద బాధితులకు వంట గిన్నెల ఆర్థిక సహాయం

## మండల అధికారులు, కార్యదర్శులు 49 కుటుంబాలకు వంట గిన్నెల పంపిణీ.





**ఖమ్మం,పెన్ పవర్ ,సెప్టెంబర్ 7:**ప్రకృతి కోపానికి గురైన రాకాసి తండా వరద బాధితులకు అండగా మేమున్నామంటూ మండల ప్రభుత్వ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఆర్థిక సహాయం చేయడానికి ముందుకు వచ్చారు. తిరుమలాయపాలెం మండలం రాకాసి తండా ప్రజలకు తిరుమలాయపాలెం
మండల అధికారులు రాకాసి తండా గ్రామ 49 కుటుంబాలకు ప్రతి ఇంటికి 45 వేల రూపాయలు విలువ చేసే వస్తు సామాగ్రి ప్రతి ఇంటికి కళాయి-1, అన్నం మరియు కూరకు రాతిండు గిన్నెలు-2, స్టీల్ గిన్నె-1, అన్నం గంటె-1, కూర గంటె-1, కంచాలు-3, మంచి నీటి గ్లాసులు-2,చెంచాలు-2 పంపిణీ చేసి వారి ఔదార్యాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో
ఎంపీడీవో సిలార్ సాహెబ్, యం.పి.ఓ. పి.సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు, అంజయ్య, వినోద్,కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.





## బయ్యారం మండలం లో ఉరుములుతో కూడిన భారీ వర్షం..

- మొదటి పేజి తరువాయి

పట్టణంలో సుమారు రెండు గంటల పాటు వర్షం కురవడంతో రహదారులు జలమయమయ్యాయి. నాళాలు పొంగి ప్రవహించాయి.బయ్యారం మండలం లో ఉరుములుతో కూడిన భారీ వర్షం పడింది. జగ్నతండాను వరద నీరు చుట్టుముట్టింది. ఇండ్లలోకి భారీగా వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆర్టీసీ కాలనీలో రోడ్లు జలమయమయ్యాయి.
మహబూబాబాద్, జనగామ జిల్లాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో పలుచోట్ల భారీ వర్షం కురిసింది. రోడ్డు పక్కన ఉన్న చెట్లు విరిగి కిందపడ్డాయి. మహబూబాబాద్ మండలంలో పలు చోట్ల ఐదు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. బలంగా వీచిన గాలికి పలు గ్రామాల్లో ఇంటి పైకప్పులు లేచిపోయాయి. విద్యుత్ స్తంభాలు విరగడంతో కరెంట్ సరఫరాను నిలిపివేశారు.బయ్యారంలో సుమారు రెండు గంటల పాటు భారీ వర్షం కురవగా చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇదే మండలంలోని సత్యనారాయణపురం గ్రామంలో కొబ్బరిచెట్టుపై పిడుగు పడింది. ఏజెన్సీ ప్రాంతంలో వరి, మక్కజొన్న, మిర్చి పంటలు దెబ్బతిన్నాయి. ఇటుక బట్టీల్లో ఇటుకలు తడిసిపోయాయి. జనగామ జిల్లా దేవరుప్పుల, పాలకుర్తి మండలాల్లోనూ భారీ వర్షం కురిసింది. కామారెడ్డిగూడెంలో పిడుగు పడడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

# వరద బాధితులకు నిత్యవసర సరుకులు..

### కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ స్వంత ఖర్చులతో స్థానిక బిజెపి నాయకులు పంపిణీ..





**ఖమ్మం, పెన్ పవర్, సెప్టెంబర్ 7:** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం రాకాసితండా గ్రామంలో 70 కుటుంబాలకు బంధం పల్లిలో 150 కుటుంబాలకు కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సొంత ఖర్చుతో నిత్యావసర సరుకులను పంపించగా వాటిని బిజెపి నాయకులు పంపిణీ చేశారు. అకేరు వరద ప్రభావం తో రాకాసి తండా ప్రజలు సర్వం కోల్పోయి నిరాశ్రయులయ్యారు.నిన్న రాకాసి తండా గ్రామం వారికి అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. అందులో భాగంగా ప్రభుత్వం వరద బాధితులకు ఇస్తున్న సాయం తో పాటుగా తన వంతు సాయం గా 70 కుటుంబాలకు నిత్యావసర సరుకులను ఆయన సొంత ఖర్చుతో ఇచ్చారు. ఆ సరుకులను రాకాసి తండా గ్రామస్తులు కు స్థానిక నాయకులు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తక్కలపల్లి నరేందర్ రావు మండల అధ్యక్షులు బొడ్డుపల్లి ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు గుండా శ్రీనివాస్ రెడ్డి,పాలేరు అసెంబ్లీ కన్వీనర్ మేక సంతోష్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి నల్లగట్టు శ్రీను, వీరభద్రం,సునీల్ అందజేశారు.

## నాగార్జునసాగర్ కు కొనసాగుతున్న వరద ప్రవాహం... 24 గేట్లు ఎత్తిన అధికారులు

ఎగువ ప్రాంతాల్లో వర్షాలు

కృష్ణా నది పోటెత్తుతున్న వైనం

నాగార్జునసాగర్ వద్ద ఇన్ ఫ్లో 2.63 లక్షల క్యూసెక్కులు

2.21 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేసిన అధికారులు



**హైదరాబాద్ పెన్ పవర్:**కృష్ణా నది ఇంకా ఉద్ధృతంగానే ప్రవహిస్తోంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. దాంతో అధికారులు సాగర్ ప్రాజెక్టులో 24 గేట్లు ఎత్తి 2.21 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. నాగార్జునసాగర్ వద్ద ఇన్ ఫ్లో 2.63 లక్షల క్యూసెక్కులుగా ఉంది. సాగర్ పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా... ప్రస్తుతం ప్రాజెక్టులో 311.4 టీఎంసీల నీరు ఉంది. మహారాష్ట్ర, కర్ణాటకలో ఇప్పటికీ వర్షాలు కురుస్తుండడంతో కృష్ణా నది పోటెత్తుతోంది.

## సమ్మక్క సారక్క ట్రైబల్ యూనివర్సిటీలో ఉద్యోగాలు




**హైదరాబాద్ పెన్ పవర్:**ములుగు జిల్లాలోని సమ్మక్క సారక్క ట్రైబల్ యూనివర్సిటీలో 6 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటి భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. గెస్ట్ ఫ్యాకల్టీ కింద నియామకాలు చేపట్టనున్నారు. 2024- 25 విద్యా సంవత్సరానికి సంబంధించిన సెమిస్టర్ కోసం బోధించాలని అధికారులు స్పష్టం చేశారు. దీనికి సంబంధించి తాజాగా నోటిఫికేషన్ విడుదల చేశారు.ఆసక్తి ఉన్నవారు అప్లై చేసుకోవాలని అధికారులు సూచించారు.

**పోస్టుల వివరాలు..**

ఎకనామిక్స్ విభాగంలో గెస్ట్ ఫ్యాకల్టీ 3 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ 3 పోస్టులు అన్ రిజర్వ్‌డ్. ..55 శాతం మార్కులతో ఎంఏ ఎకనామిక్స్ పీజీ చేసిన అభ్యర్థులు ఈ పోస్టులకు అర్హులు. అలాగే.. నెట్ లేదా జేఆర్ఎఫ్‌లో ఉత్తీర్ణత సాధించి ఉండాలి. ఎకనామిక్స్‌లో పీహెచ్‌డీ చేసిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుంది. యూజీసీ నిబంధనల ప్రకారం వీరికి గౌరవ వేతనం చెల్లిస్తారు.

**ఇంగ్లీష్ విభాగంలో..**

ఇంగ్లీష్ విభాగంలో 3 గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులు ఉన్నాయి. వాటిల్లో 2 పోస్టులు అన్ రిజర్వ్‌డ్ కాగా.. ఒక పోస్టును ఓబీసీకి కేటాయించారు. ఎంఏ ఇంగ్లీష్‌లో ...55 శాతం మార్కులు సాధించిన వారు అర్హులు. నెట్ లేదా జేఆర్ఎఫ్‌లో ఉత్తీర్ణత సాధించి ఉండాలి. ఇంగ్లీష్ లిటరేచర్‌లో పీహెచ్‌డీ చేసిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుంది. వీరికి కూడా యూజీసీ నిబంధనల ప్రకారం గౌవర వేతనం చెల్లిస్తారు.

# దేవుడి ఆశీస్సులతో తక్కువ నష్టంతోనే బయటపడ్డం: సీఎం రేవంత్





**హైదరాబాద్ పెన్ పవర్:** ఖైరతాబాద్ బడా గణేషుడి ఉత్సవాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గణేష్ చతుర్థి సందర్భంగా ఇవాళ (సెప్టెంబర్ 7) ఖైరతాబాద్ బడా గణనాథుడికి అర్చకులు తొలి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి మనువడితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ కు అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం సీఎం రేవంత్ ఖైరతాబాద్ వినాయకుడికి తొలి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 70 ఏండ్లుగా ఖైరతాబాద్ లో గణేష్ ఉత్సవాలు జరుగుతున్నాయని.. ఖైరతాబాద్ బడా గణేషుడి ఉత్సవాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. ఖైరతాబాద్ ఉత్సవ సమితి ప్రతినిధులతో ముందే మాట్లాడామని.. ఉత్సవాలకు అన్ని విధాల సహకరిస్తామని చెప్పామన్నారు. హైదరాబాద్ సిటీలో అత్యంత గొప్పగా గణేష్ ఉత్సవాలు జరుగుతాయని.. హైదరాబాద్ మత సామరస్యానికి ప్రతీక అని అన్నారు. ఈ ఏడాది ఒక్క హైదరాబాద్ సిటీలోనే లక్షా 40 వేల గణనాథుడి విగ్రహాలు ఏర్పాటు చేశారని తెలిపారు. గణేష్ మంటపాలకు ఉచితంగా కరెంట్ ఇస్తున్నట్లు ఈ సందర్భంగా మరోసారి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు.


%బాశ్రీంశీ =ఘుం% :- బెల్లంపల్లి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రత్యేక పూజలు..ఇక, ఇటీవల రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు, వరదలతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడ్డారని.. దేవుడి ఆశీస్సులతో తక్కువ నష్టంతోనే బయటపడ్డామని అన్నారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డిని ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ సమితి కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ పూజ కార్యక్రమంలో తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ దీపాదాస్ మున్షీ, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్థానిక కార్పొరేటర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో ప్రసిద్ధి చెందిన గణపతి మండపాలు ఇవే..









**హైదరాబాద్ పెన్ పవర్:** రెండు తెలుగురాష్ట్రాల్లో వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇక, తెలంగాణలో వీటి గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. వీధి వీధుల్లో గణపతి బప్ప మోరియా అంటూ నినాదాలు మారుమోగుతాయి. అయితే,నగరంలో ఖైరతాబాద్ వినాయకుడి మండపంతో పాటు అత్యంత ప్రసిద్ధి చెందిన గణేషుని మండపాలు చాలానే ఉన్నాయి. హైదరాబాద్‌లోని ప్రసిద్ధిచెందిన గణేషుని మండపాల గురించి తెలుసుకుందాం

**ఖైరతాబాద్:** హైదరాబాద్‌లో ఖైరతాబాద్ వినాయకుడు ఎంతో ప్రసిద్ధి..ఇక్కడ ప్రత్యేకంగా నవరాత్రిళ్ల సమయంలో నిత్యం వేలాదిమంది భక్తులు లంబోదరుని దర్శనం కోసం వస్తారు. . హైదారాబాద్‌లో ప్రసిద్ధిచెందిన గణేషుని మండపాలలో ఖైరతాబాద్ వినాయకుని మండపం ఒకటి. ఇక్కడ 1954 నుండి గణేష్ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది ఇక్కడి వినాయకుడిలో ఒక్కో ప్రత్యేకత.. ఒక్కో ఎత్తుతో భక్తులకు దర్శనమిస్తారు. ఖైరతాబాద్ గణపతి అంటే ఒక్కతెలుగు రాష్ట్రాలకే కాదు, విదేశీ పర్యాటకులకు సైతం ఆసక్తిగా ఉంటుంది. ఇక ఈ ఏడాది (2024) ఖైరతాబాద్ గణేశుడు 70 అడుగుల ఎత్తుతో.. సప్తముఖ గణపతి అవతారంలో కొలువుదీరాడు. ఈసారి ఇక్కడ అత్యంత రద్దీ నెలకొనుంది. పోలీసులు భద్రతా దృష్ట్యా ఇక్కడ భారీ బందోబస్తును కూడా ఏర్పాటు చేశారు.

**బాలాపూర్ :** హైదరాబాద్‌లో మరో ప్రసిద్ధిచెందిన గణపతి మండపం బాలాపూర్. ఇక్కడికి ఓ ప్రత్యేక విశిష్టత ఉంది. ఇక్కడి లడ్డూ వేలం పాట ఎంతో ప్రత్యేకత. బాలాపూర్ గణేష్ అసోసియేషన్ 1980లో ప్రారంభమైంది. లడ్డూ వేలం పాటను మాత్రం 1994లో ప్రారంభమైంది. అప్పుడు కేవలం 450 రూపాయలతో మొదలయ్యింది. ఈ లడ్డూను పొలంలో చల్లితే పంటలు బాగా పండుతాయని ప్రజల నమ్మకం. అందుకే ఎక్కువశాతం ఈ వేలంపాట స్థానికులకే దక్కుతుంది. ఇక్కడ వేలంపాట మొదలయినప్పటినుంచి పదిహేడేళ్లు స్థానికులకే అవకాశం కల్పించారు. అనంతరం స్థానికులేతరులు వేలంపాట దక్కించుకుంటున్నారు. ఈ వేలం పాటకు పోటీలు కూడా నిర్వహిస్తారు. వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమైనప్పటినుంచే వేలంపాటలు పోటీలు ఉంటాయి. వాటికి దరఖాస్తులు కూడా తీసుకుంటారు. ఈ వేలంపాట ధరఖాస్తులను నిమజ్జనం రోజు ఉదయం ఏడు గంటలకు ముగిస్తారు. లడ్డూను దక్కించుకున్న వారు ఒక అగ్రిమెంట్ పైన సంతకం కూడా చేయాల్సి ఉంటుంది.

**గౌలిపుర:** నగరంలోని పాతబస్తీ ప్రాంతంలో, వినాయక చవితి ఉత్సవాలు ఎంతో సంప్రదాయంగా నిర్వహిస్తారు. ఇక్కడ వినాయకుని ఉత్సవాలను అత్యంత పురాతనమైన ప్రసిద్ధ మండపాల్లో జరుపుతారు. అందులో గౌలిపుర గణపతి ఒకటి. ఇక్కడి మండపంలోని వినాయకుడిని చూసేందుకు తెలుగు రాష్ట్రాల వారే కాకుండా తమిళనాడు, కర్నాటక మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాల ప్రజలు కూడా వస్తారు. ఇక్కడ ప్రతి ఏటా వినాయకుని ఒక్కో రూపంలో ప్రతిష్టిస్తారు. వినాయకుని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వినాయకునికి భారీ అలంకరణ, సెట్టింగ్ లతో ఏర్పాటు చేస్తారు. ఆ తొమ్మిదిరోజులు విశేష పూజలు చేస్తారు. వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా ఇక్కడ ప్రతి ఏటా అన్నదానం వంటి కార్యక్రమాలు చేస్తారు. అంతేకాదు, భారీ బ్యాండ్ ప్రదర్శనలు కూడా ఉంటాయి. వీటితోపాటు వీధుల్లో చేసే నృత్యాలు ఇక్కడికి వచ్చేవారిని ఎంతగానో ఆకట్టుకుంటాయి.

## రోడ్డు పక్కనే చెత్త పారేసినట్లుగా పసిబిడ్డను పారేశారు.



**హైదరాబాద్ పెన్ పవర్:**సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామంలో దారుణం జరిగింది.. కొంతమంది దుర్మాఅప్పుడే పుట్టిన మగ శిశువును చెత్తలో పడవేశారు.. శిశువు అరుపులు విని గమనించిన స్థానికులు... సిద్దిపేట ఆసుపత్రికి తరలించారు. అమ్మ కడుపులోంచి బైటపడి ఇంకా లోకం వంక కన్నెత్తైనా చూడనేలేదు. అమ్మ పేగు తెంచుకుని పుట్టినప్పుడు అయిన రక్తపు చారికలు ఇంకా ఆరనేలేదు. కాని ఆ తల్లిదండ్రులు ఏం తప్పు చేశారో కాని పండండి మగ బిడ్డను చెత్తకుప్పలో విసిరేసిన ఘటన సిద్దిపేటలో జరిగింది. . కన్నతల్లి పుట్టిన బిడ్డ భారమనుకుందో ఏమో తెలీదు..నవ మాసాలు మోసి కన్నతల్లి పేగు బంధం బరువనుకుందోమో..అప్పుడే పుట్టిన పసిగుడ్డుకు చెత్తకుప్పలో పారేశారు. . అప్పుడే పుట్టిన పసిబిడ్డను ఏదో చెత్తను పారేసినట్లుగా రోడ్డు పక్కనే పారేసిన పాశవిక ఘటన సిద్దిపేటలో చోటుచేసుకుంది.. పశువులు..క్రూర జంతువులు కూడా తమకు పుట్టిన బిడ్డనుతమ ప్రాణాలు అడ్డం వేసి కాపాడుకుంటాయి. కానీ అప్పుడే పుట్టిన పసిగుడ్డును రోడ్డు పక్కన దుర్మార్గులు పారేశారు. పసిగుడ్డు ఏడుపు విని అటుగా వెళ్లే స్థానికులు స్థానిక ఆస్పత్రికి తరలించారు.

## దొంగతనం చేస్తుంటే చూశాడని బాలుడిని బండకేసి కొటిన ఉన్మాది




**హైదరాబాద్ పెన్ పవర్:** పందులు దొంగలించడాన్ని చూశాడని ఆరేళ్ల బాలుడిని ఓ వ్యక్తి హత్య చేశాడు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపల్ పరిధిలోని హాజీపల్లి రోడ్ లో కొంతమంది జీవనోపాధి కోసం ఎంతో కాలంగా గుడిసెలు వేసుకొని పందుల పెంపకంపై ఆధారపడి ఉన్నారు. అయితే శుక్రవారం రాత్రి సమయంలో ఎల్లయ్య అనే వ్యక్తి పందులను దొంగలిస్తుండగా.. దుర్గయ్య, సాయమ్మల ఆరేళ్ల కుమారుడు కట్టప్ప చూశాడు.

దొంగతనానికి పాల్పడ్డ ఎల్లయ్య ఆ విషయాన్ని కట్టప్ప ఎవరికైనా చెబుతాడేమోనని అనుమానంతో ఆ బాలుడిని బండరాయికి కొట్టి చంపాడు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలుడి మృదేహాన్ని పోస్టుమార్టం చేసి.. కుటుంబ సభ్యులకు అప్పగించారు పోలీసులు.

# ఊరూ వాడా గణపతి బొప్పా మోరియా నినాదాలు..
# ప్రముఖ ఆలయాలు, మండపాలు కిటకిట



**హైదరాబాద్ పెన్ పవర్:**దేశవ్యాప్తంగా గణేశ్ చతుర్థి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. భక్తులతో ఆలయాలు, గణేశ్ మండపాలు కిటకిటలాడుతున్నాయి. హైదరాబాద్ .. ఖైరతాబాద్ వినాయకుడిని గవర్నర్ దంపతులు దర్శించుకున్నారు. సికింద్రాబాద్ గణపతి ఆలయంలో వైభవంగా నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్నాయి. గువాహటి లతాషిల్‌లోని గణేష్ మందిర్‌లో శనివారం వినాయక చవితిని పురస్కరించుకుని భక్తులు మట్టి దీపాలు వెలిగించారు పుణెలోని ఓ కుటుంబం వినాయక చవితి సందర్భంగా వినాయకుడి విగ్రహాన్ని తీసుకెళ్లింది. మరోవైపు దేశ, విదేశాల్లోని భారతీయులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుభాకాంక్షలు తెలిపారు. నాగ్‌పూర్‌లో వినాయక చవితిని పురస్కరించుకుని వినాయక విగ్రహాన్ని మండపానికి తీసుకెళ్లిన ఊరేగింపులో భక్తులు పాల్గొన్నారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శనివారం ( సెప్టెంబర్ 7) ముంబైలోని సిద్ధివినాయక ఆలయంలో భక్తులు హారతి ఇచ్చారు. ముంబైలో గిర్‌గాంచ రాజా సర్వజనిక్ గణేశోత్సవ్ మండల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక

చవితి వేడుకల్లో భాగంగా పర్యావరణహిత వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.ఘట్కోపర్ పోలీస్ స్టేషనవ్‌కి చెందిన పోలీసు అధికారులు శుక్రవారం వినాయకుడి విగ్రహాన్ని ముంబైలోని పోలీస్ స్టేషన్‌కి తీసుకెళ్లారు. దిల్లీలో అమ్మకానికి ఉంచిన వినాయకుడి మట్టి విగ్రహానికి ఓ మహిళా కళాకారిణి శనివారం తుది మెరుగులు దిద్దారు. ముంబైలోని లాల్‌బాగ్చా కా రాజా సర్వజనిక్ గణేశోత్సవ్ మండల్ వద్ద వినాయకుడి విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ ప్రసిద్ధ గణేష్ విగ్రహం 1934 నుంచి అక్కడ పూజలు పొందుతోంది.

# నిండుకుండలా ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ రిజర్వాయర్లు..



**హైదరాబాద్ పెన్ పవర్:** ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో జంట శలాశయాలైన ఉస్మాన్ సాగర్( గండిపేట), హిమాయత్ సాగర్ రిజర్వాయర్లు పూర్తిగా నిండిపోయాయి.. నిండు కుండను తలపిస్తున్నాయి. హిమాయత్ సాగర్ పూర్తి స్థాయి నీటిమట్టం 1763.50 అడుగులు ఉండగా.. ప్రస్తుత నీటిమట్టం 1761.10 అడుగులకు చేరింది. రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం 2.970 టీఎంసీలు ఉండగా.. ప్రస్తుతం నీటి నిల్వ 2.455 టీఎంసీలుగా ఉంది. ఉస్మాన్ సాగర్ పూర్తిస్థాయి నీటి మట్టం 1790 అడుగులు ఉండగా.. ప్రస్తుతం నీటి మట్టం 1787.95 అడుగులుగా ఉంది. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 3.90 టీఎంసీలు ఉండగా.. ప్రస్తుతం నీటి నిల్వ 3.430 టీఎంసీలుగా ఉంది.

ఎగువ ప్రాంతాలను భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో.. ఈ రెండు రిజర్వాయర్లనుంచి నీటిని దిగువకు వదిలేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.. శనివారం సాయంత్రం దిగువకు నీటిని వదలనున్నట్లు సమాచారం.. ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

# బెల్లంపల్లి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రత్యేక పూజలు..



**హైదరాబాద్ పెన్ పవర్:**బెల్లంపల్లి పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఎమ్మెల్యే గడ్డం వినోద్. వినాయక చవితి సంధర్భంగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఎమ్మెల్యే.ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బెల్లంపల్లి నియోజవర్గ ప్రజలందరికి వినాయక చవితి సందర్భంగా వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో అష్టైశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించామని తెలిపారు. ముఖ్యమంత్రి, రేవంత్ రెడ్డి ,సోనియాగాంధీ ఆశీర్వాదం తో బెల్లంపల్లి నియోజవర్గాని అభివృద్ధి చెందుతుందని అన్నారు ఎమ్మెల్యే గడ్డం వినోద్.

# తెలంగాణలో మూడు రోజుల పాటు వర్షాలు.. ఐఎండీ హెచ్చరిక



హైదరాబాద్ పెన్ పవర్:తెలుగు రాష్ట్రాల్లో ఆదివారం ( సెప్టెంబర్ 8) నుంచి తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు పడే అవకాశం ఉంది. ఇక తెలంగాణలోని పలు జిల్లాల్లో సెప్టెంబర్ 08, 09, 10 తేదీల్లో అతి భారీ వర్షాలు పడుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలను జారీ చేసింది. తెలంగాణలో మరో మూడు రోజుల పాటు మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో పాటు ఉపరితల ఆవర్తన ప్రభావం కొనసాగుతోందని ఐఎండీ వెల్లడించింది. సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో తెలంగాణలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది.

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మధ్య బంగాళాఖాతం, అనుకుని ఉన్న ఉత్తర బంగాళాఖాతం మీద ఉందని ఐఎండీ వివరించింది. దానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం సముద్రమట్టానికి సగటున 7.6 కి.మీ ఎత్తు వరకు విస్తరించి ఉందని తెలిపింది. సెప్టెంబర్ 9వ తేదీ నాటికి ఉత్తర ఒడిశా, బంగ్లాదేశ్ తీరంలోని పరిసర ప్రాంతాల్లో అల్పపీడనంగా మారుతుందని అంచనా వేసింది. తెలంగాణలో పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా వేసింది. ఆరెంజ్ హెచ్చరికలను జారీ చేసింది. సెప్టెంబర్ 8 నుంచి మళ్లీ రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

ఉత్తర బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడన ప్రాంతం ఉత్తర దిశగా కదులుతూ వాయువ్య మరియు పరిసర మధ్య బంగాళాఖాతంలో ప్రస్ఫుటమైన అల్పపీడన ప్రాంతంగా ఏర్పడింది. దీని అనుబంధ ఆవర్తనం సగటు సముద్ర మట్టం నుండి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఎత్తుకు వెళ్లే కొద్దీ నైరుతి దిశ వైపు వంగి వున్నది. ఇది ఉత్తర దిశగా కదులుతూ బలపడి ఉత్తర ఒడిశా మరియు పశ్చిమ బెంగాల్ తీరంలోని వాయువ్య బంగాళాఖాతం వద్ద ఈనెల 8న వాయుగుండంగా మారే అవకాశం వుంది. తరువాత ఇది పశ్చిమ – వాయువ్య దిశగా కదులుతూ వచ్చే 3 రోజులలో గంగేటిక్ పశ్చిమ బెంగాల్, ఉత్తర ఒడిశా, ఝార ండ్ మరియు పరిసర ఉత్తర ఛత్తీస్‌గఢ్ మీదుగా కొనసాగే అవకాశం వున్నది. ఋతుపవన ద్రోణి ఈరోజు సగటు సముద్ర మట్టానికి బికానర్, కోట, పెండ్రా రోడ్, పరదీప్, వాయువ్య మరియు పరిసర మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన ప్రస్ఫుటమైన అల్పపీడన ప్రాంతం యొక్క కేంద్రం గుండా కొనసాగుతున్నది.

తెలంగాణలో ఆదివారం ( సెప్టెంబర్ 8) పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా వేసింది. సెప్టెంబర్ 9 నుంచి మూడు రోజుల పాటు మళ్లీ రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. సెప్టెంబర్ 9వ తేదీన ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ అయ్యాయి. సెప్టెంబర్ 10వ తేదీన కూడా పలు జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. మరికొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు పడుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

# వరద బాధితులకు మెగా డాటర్ నిహారిక విరాళం

### విజయవాడ ప్రాంతాన్ని కుదిపేసిన వరదలు

### పది గ్రామాలకు రూ.50 వేల చొప్పున రూ.5 లక్షల విరాళం ప్రకటించిన నిహారిక

### ఈ కష్టాలు తొలగిపోవాలని ప్రార్థిస్తున్నట్టు వెల్లడి



హైదరాబాద్ పెన్ పవర్:ఇటీవల వరదల నేపథ్యంలో మెగా ఫ్యామిలీ నుంచి రూ. 9.45 కోట్ల వరకు విరాళాన్ని అందించారు. తాజాగా మెగా డాటర్ నిహారిక వ్యక్తిగతంగా ఏపీలో వరద బాధితులకు రూ. 5 లక్షల విరాళాన్ని ప్రకటించారు. బుడమేరు నది వరదల కారణంగా తీవ్రంగా ప్రభావితమైన పది గ్రామాలపై నిహారిక దృష్టి కేంద్రీకరించారు.

నిహారిక ఆర్థిక విరాళాన్ని ప్రకటిస్తూ... "బుడమేరు వాగు ముంపుతో విజయవాడ రూరల్ ఏరియాలో అనేక గ్రామాలు నీట మునగడం, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతుండడం నాకు చాలా బాధ కలిగించింది. ఇటువంటి ప్రకృతి విపత్తుల్లో ఎక్కువగా ఇబ్బందులు పడేది గ్రామీణ ప్రాంత ప్రజలే.

నేను పుట్టి పెరిగిన వాతావరణం అంతా నగరంలోనే అయినా మా పెద్దవారు అందరూ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చినవారే కాబట్టి వారి చెప్పే అనుభవాలు విన్న దృష్ట్యా నాకు గ్రామీణ వాతావరణంపై ఎంతో అభిమానం ఉంది. ఉప ముఖ్యమంత్రి అయిన మా బాబాయ్ పవన్ కళ్యాణ్ గారితో పాటు మా కుటుంబీకులు అందరూ బాధితులకు అండగా నిలబడడం నాకు ఎంతో సంతోషాన్ని కలిగించింది.

నేను కూడా ఈ బృహత్కార్యంలో పాలు పంచుకోవాలనే ఉద్దేశంతో ఉడతా భక్తిగా వరద ముంపునకు గురైన పది గ్రామాలకు ఒక్కో గ్రామానికి ఏభై వేలు చొప్పున ఐదు లక్షలు రూపాయలు విరాళంగా ఇవ్వాలని నిర్ణయించుకున్నాను. ఈ విపత్కర పరిస్థితులు తొందరగా తొలగిపోవాలని, ప్రజలంతా సురక్షితంగా ఉండాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను" అని అన్నారు.

## వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక: ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్





హైదరాబాద్ పెన్ పవర్:వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించి ముందుకు వెళ్తామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు.

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ నమూనాలను పరిశీలించి,ఆలయ అభివృద్ధి పనులపై కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఆలయ అధికారులతో కలిసి శనివారం ఆలయ ఈఓ గెస్ట్ హౌస్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు.

దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి భక్తులకు స్వామివారి దర్శనం వేగంగా కల్పించేందుకు, మెరుగైన వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆలయ అభివృద్ధి పనులను శృంగేరి పీఠం, పండితులు, భక్తుల సూచనల మేరకు చేపట్టి ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు.శృంగేరి పీఠాధిపతి సూచనలు, సలహా మేరకు అభివృద్ధి చేస్తామన్నారు. భక్తులకు వేగంగా దర్శనం,మంచి వసతి,ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తామని తెలిపారు. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయ విస్తరణ పనులను త్వరగా పూర్తి చేస్తామన్నారు. ఆలయ పరిసరాల్లో నిర్మాణాల పై గతంలో ఇచ్చిన %+ూ% నెంబరు 149 రద్దు పై చర్చించారు.

గతంలో శృంగేరి పీఠన్ని సందర్శించినపుడు ఆలయ విస్తరణ నమూనాతో రావాలని వారు తెలిపారని విప్ గుర్తు చేశారు.ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలయ విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు.. ఈ క్రమంలో త్వరలో శృంగేరి పీఠన్ని సందర్శించి ఆలయ విస్తరణ పై నమూనాలను శృంగేరి పీఠాధిపతి ఉత్తరాధికారి శ్రీ విధుశేఖర భారతి స్వామివారిని కలిసి వారి సూచనలు సలహాల ప్రకారం ఆగమ శాస్త్రాన్ని అనుసరించి విస్తరణ చేపడుతామని ప్రభుత్వ విప్ స్పష్టం చేశారు. ఆధ్యాత్మికత ఉట్టి పడేలా ఆలయాన్ని విస్తరిస్తామని తెలిపారు..

**జీవో నంబర్ 149 రద్దు పై చర్చ**

గత ప్రభుత్వ హయంలో వేములవాడ రాజన్న ఆలయ పరిసరాలలో నూతనంగా 1000 మీటర్ల (కిలో మీటర్ ) పరిధిలో చేపట్టబోయి నిర్మాణాలపై ఇచ్చిన జీవో నెంబర్ 149 రద్దుపై చర్చించారు.. ఈ జీవో వలన పట్టణంలో ఆలయం పరిసరాల్లో అనుకున్న స్థాయిలో అభివృద్ధి జరగలేదని పేర్కొన్నారు.. జీవో నంబర్ 149 రద్దుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు..

# ఈ గణేశుడు చాలా కాస్ట్ లీ గురూ.. ఏకంగా రూ. 400కోట్లతో బీమా!

- దేశవ్యాప్తంగా ఘనంగా గణేశ్ చతుర్థి వేడుకలు
- వివిధ రూపాల్లో వినాయకుడి కనువిందు
- స్పెషల్ అట్రాక్షన్‌గా ముంబైలోని జీఎస్‌బీ సేవా మండల్ మహాగణపతి
- ఈసారి విఘ్నేశ్వరుడి విగ్రహాన్ని 66 కేజీల బంగారం, 325 కేజీల వెండి ఆభరణాలతో అలంకరణ
- అందుకే ఈ ఉత్సవాలకు రూ. 400 కోట్లతో బీమా చేయించిన నిర్వాహకులు



**హైదరాబాద్ పెన్ పవర్:**దేశవ్యాప్తంగా గణేశ్ చతుర్థి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఎక్కడ చూసిన వినాయకుడి మండపాలు దర్శనమిస్తున్నాయి. వివిధ రూపాల్లో వినాయకుడు కనువిందు చేస్తున్నాడు. అందరూ భక్తి శ్రద్ధలతో లంబోదరుడిని కొలుస్తున్నారు. అయితే, ఈసారి కూడా వినాయక వేడుకల్లో ముంబైలోని జీఎస్‌బీ సేవా మండల్ మహాగణపతి విగ్రహం వార్తల్లో నిలిచింది. దేశంలోనే సంపన్న గణపతిగా పేరొందిన ఈ లంబోదరుడి ఉత్సవాల కోసం నిర్వాహకులు ఈ ఏడాది ఏకంగా రూ. 400 కోట్లతో బీమా చేయించారు. దీనికి కారణంగా ఈ వినాయకుడిని భారీగా పసిడి, వెండి నగలతో అలంరించడమే. ముంబై శివారు ప్రాంతమైన మాతుంగాలో ఈ కాస్ట్ లీ గణేశుడిని ప్రతిష్ఠించడం జరుగుతోంది. ఇలా గత ఏడు దశాబ్దాలుగా జీఎస్‌బీ సేవామండల్ వినాయక వేడుకలను ఎంతో ప్రత్యేకంగా నిర్వహిస్తూ వస్తోంది. ఈసారి 70వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మండపంలోని లంబోదరుడిని ఏకంగా 66 కేజీల బంగారం, 325 కేజీల వెండి ఆభరణాలతో అలంకరించడం జరిగింది. అందుకే ముందుజాగ్రత్తగా ఈ ఉత్సవాలకు రూ. 400.58 కోట్లతో బీమా చేయించామని నిర్వాహకులు ప్రముఖ మీడియా ఏజెన్సీతో చెప్పారు. 2023లో కూడా ఈ గణేశ్ మండపానికి రూ. 360.40 కోట్లకు బీమా తీసుకోవడం జాతీయ స్థాయిలో మీడియా దృష్టిని ఆకర్షించింది. ఇక మండపంలో భద్రతా చర్యల్లో భాగంగా ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాలను ఏర్పాటు చేశారు నిర్వాహకులు. అలాగే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా డిజిటల్ లైవ్ సేవలు, క్యూఆర్ కోడ్ వంటి వాటిని అందుబాటులో ఉంచారు. ఇవాళ్టి నుంచి ఈ నెల 11 వరకు ఐదు రోజుల పాటు ఈ సంపన్న గణేశుడి వేడుకలను నిర్వహించనున్నారు.

## పాప్యులారిటీ కోసం ఇలాంటి సోయిలేని పనులు చేయకండి.. సజ్జనార్ ఫైర్!

- సోషల్ మీడియాలో వైరల్ కావడం కోసం యువకుడి వింత చేష్టలు
- ఆర్టీసీ బస్సును ఆపి, ఎక్కకుండా అక్కడి నుంచి పరారైన యువకుడు
- తన స్నేహితులు ఇచ్చిన ఛాలెంజ్ కోసం యువకుడి సోయిలేని పని
- దీనిపై 'ఎక్స్' వేదికగా టీజీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ మండిపాటు



**హైదరాబాద్ పెన్ పవర్:**ఇటీవల కొందరు సోషల్ మీడియాలో పాప్యులారిటీ కోసం వింత చేష్టలకు పాల్పడుతున్నారు. ప్రాణాలు సైతం లెక్కచేయకుండా వెర్రి పనులు చేస్తున్నారు. ఇదే కోవకు చెందిన వీడియో ఒకటి తాజాగా నెట్టింట వైరల్ అవుతోంది. అది కూడా తెలంగాణ ఆర్టీసీకి సంబంధించిన వీడియో కావడంతో దీనిపై టీజీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించారు. వీడియోలో ఓ యువకుడు ఆర్టీసీ బస్సును ఆపి, ఆ వెంటనే అక్కడి నుంచి పరిగెత్తడం ఉంది. తన స్నేహితులు ఇచ్చిన ఛాలెంజ్ కోసం ఆ యువకుడు ఇలా చేయడం వీడియో చూస్తే అర్థమవుతోంది. దీనిపై సజ్జనార్ మండిపడ్డారు. సోషల్ మీడియాలో పాప్యులారిటీ కోసం ఇలాంటి వెర్రి చేష్టలు అవసరమా!? అని ఫైర్ అయ్యారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికి అసౌకర్యం కలుగుతుందనే సోయి లేకుండా కొందరు ఇలా వికృతానందం పొందుతున్నారంటూ మండిపడ్డారు. లైకులు, కామెంట్ల కోసం ఇలాంటి పిచ్చి పనులు మానుకోవాలని సూచించారు. బంగారు భవిష్యత్ వైపునకు బాటలు వేసి, జీవితంలో ఉన్నతంగా ఎదగాలని సజ్జనార్ హితవు పలికారు. దీంతో ఇప్పుడీ ట్వీట్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఆ యువకుడిని నెటిజన్లు ఇలాంటి పనులేంటి అని చురకలంటిస్తున్నారు.

## క్షేమంగా దిగిన బోయింగ్ స్టార్ లైనర్.. వ్యోమగాములను అక్కడే వదిలేసి వచ్చిన స్పేస్ షిప్

- న్యూమెక్సికోలో సేఫ్ గా ల్యాండైందని నాసా వెల్లడి
- సునీతా విలియమ్స్ ను ఐఎస్ఎస్ కు చేర్చిన స్పేస్ క్రాఫ్ట్
- తిరిగి తీసుకురాలేక ఖాళీగా తిరిగి వచ్చిన వైనం



**హైదరాబాద్ పెన్ పవర్:**భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ ను అంతరిక్ష కేంద్రానికి చేర్చిన బోయింగ్ స్టార్ లైనర్ స్పేస్ క్రాఫ్ట్ భూమికి క్షేమంగా తిరిగి వచ్చింది. భారత కాలమానం ప్రకారం శనివారం ఉదయం 9:30 గంటలకు న్యూమెక్సికోలోని వైట్ సాండ్స్ స్పేస్ హార్బర్ లో ల్యాండయింది. స్పేస్ స్టేషన్ నుంచి భూమికి చేరడానికి దాదాపు ఆరు గంటల సమయం పట్టిందని నాసా శాస్త్రవేత్తలు తెలిపారు. సునీతా విలియమ్స్ తో పాటు బుచ్ విల్ మోర్ లను తిరిగి తీసుకురాలేక వదిలేసి వచ్చింది. సాంకేతిక లోపాల కారణంగా వ్యోమగాముల భద్రతను దృష్టిలో పెట్టుకుని నాసా ఈ స్పేస్ షిప్ ను ఖాళీగా రప్పించింది. దీంతో వారం రోజుల షెడ్యూల్డ్ టూర్ కోసం వెళ్లిన సునీతా విలియమ్స్, బుచ్ విల్ మోర్ లు తిరిగి రావడానికి వచ్చే ఏడాది వరకూ వెయిట్ చేయాల్సి వస్తోంది.

**ఆది నుంచి అన్నీ ఆటంకాలే..**

బోయింగ్ స్టార్ లైనర్ ప్రయోగానికి ఆది నుంచి అన్నీ ఆటంకాలే ఎదురయ్యాయి. ప్రయోగానికి అన్నీ సిద్ధం చేశాక చివరి క్షణంలో పలుమార్లు వాయిదా పడింది. ఎట్టకేలకు ఈ ఏడాది జూన్ లో సునీతా విలియమ్స్, బుచ్ విల్ మోర్ లను తీసుకుని అంతరిక్ష కేంద్రానికి చేరుకుంది. వారం రోజుల తర్వాత తిరిగి బయలుదేరాల్సి ఉండగా సాంకేతిక సమస్య ఎదురైంది. దీంతో వ్యోమగాములను ఆ స్పేస్ క్రాఫ్ట్ లో తిరిగి తీసుకురావడం క్షేమం కాదని నాసా శాస్త్రవేత్తలు నిర్ధయించారు. మరో స్పేస్ క్రాఫ్ట్ లో వారిని తిరిగి తీసుకురావాలని నిర్ణయించి, బోయింగ్ స్టార్ లైనర్ ను ఖాళీగా రప్పించారు. తాజాగా ఈ స్పేస్ షిప్ భూమికి చేరుకుంది. వ్యోమగాములు మాత్రం వచ్చే ఏడాది ఫిబ్రవరిలో తిరిగిరానున్నారు.

# గణపతి .. గణాలకు అధిపతి మాత్రమే కాదు... ఘనమైన దైవం కూడా. ..

**హైదరాబాద్ పెన్ పవర్:**సృష్టి యావత్తూ అనేకమైన గణాలతో కూడిన మహాగణమే. ఈ గణాలన్నింటిలోనూ అంతర్యామిగా ఉంటూ, సృష్టిని శాసించే మహా శక్తిమంతుడు. అంతటి శక్తిమంతమైన దైవం కాబట్టే గణపతికి ఎంతో ఘనంగా పూజలు చేస్తారు భక్తులు. అందుకే ఆయన ఘనులకే ఘనుడు. ఘనపతి. ఘనపాఠి. ఆయన పుట్టుకే చాలా చిత్రమైనదనుకుంటే, ఆకృతి అంతకన్న విచిత్రమైనది. అయితేనేం, ఎవరిని పూజించాలన్నా, ఏ కార్యం ప్రారంభించాలన్నా అగ్రపూజ ఆయనదే! తల్లిదండ్రులను మించిన దైవం లేడని, నారాయణ మంత్రానికి మించిన మంత్రం లేదని నిరూపించి విఘ్నాధిపత్యాన్ని చేజిక్కించుకున్న సూక్ష్మగ్రాహి ఆయన.. తండ్రిలాగానే ఈయన ఆకారాన్ని కల్పించటమూ, పూజించటమూ, ప్రసన్నం చేసుకోవటమూ ఎంతో సులువు. దోసెడు మట్టి లేదా చిటికెడు పసుపు ఉంటే చాలు.. .క్షణాల్లో గణాధ్యక్షుని రూపు తయారు చేసేయవచ్చు.

గుప్పెడు గరికె... కణుపంత బెల్లం ముక్క ఉంటే చాలు...ప్రశాంతంగా పూజించుకుని, నిండుగా నైవేద్యం పెట్టేయవచ్చు. సర్వవిఘ్నాలనూ ఉపశమింపజేసి, వరాల వర్షం కురిపించే మహా ఉదారుడైన ఆ మహోదరుడి విశేషాలను వీక్షిద్దాం...

గణపతి అంటే జ్ఞానమోక్షప్రదాత అని అర్థం. మనిషిని సన్మార్గంలో పయనింపజేసేది జ్ఞానమైతే, మరుజన్మ లేకుండా చేసేది మోక్షం. గణపతి ఆవిర్భావం, రూపురేఖా విలాసాల గురించి అనేక పురాణేతిహాసాలు అనేక విధాలుగా వర్ణించినప్పటికీ సకలశాస్త్రాలూ ఆయనను పరబ్రహ్మస్వరూపంగానూ, భవిష్యద్బ్రహ్మగానూ పేర్కొన్నాయి. సామాన్యులకు మాత్రం గణపతి విఘ్నసంహారకుడు.

గణం అంటే సమూహం అని అర్థం. ఈ సృష్టి యావత్తూ గణాలమయం. అనేకమైన గణాలతో కూడిన మహాగణం. ఈ విశ్వం, మనుష్యగణం, వృక్షగణం, గ్రహగణం%–% మళ్లీ ఇందులో వివిధ ధర్మాలను అనుసరించి మరెన్నో గణాలు%–% ఈ గణాలన్నింటిలోనూ అంతర్యామిగా వుంటూ, సృష్టిని శాసించే పరమేశ్వరుడు గణపతి. సమస్త యోగాలకు గణపతియే మూలాధారం. సమస్త విశ్వానికి ఆధారశక్తి గణపతి. బ్రహ్మసూచనను అనుసరించి వేదవ్యాసుని శబ్దానికి గణపతి రూపునిచ్చాడు. అంటే మహాభారత రచనలో వేదవ్యాసుడు చెబుతుండగా గణపతి తన దంతంతో రాసినట్లు పురాణాలు పేర్కొంటున్నాయి. ఇంద్రుడు, భగీరథుడు, శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, దమయంతి, సాంబుడు, ధర్మరాజు మొదలయిన వారు గణపతిని ఆరాధించినట్లు ఐతిహ్యాలు.

### ప్రథమ పూజ ఎందుకు?

ఏ పూజ చేసినా, తొలుత గణపతిని ప్రార్థించిన తర్వాతనే తక్కిన వారిని ఆరాధించాలని, లేకపోతే ఆ పూజ నిష్ఫలమవుతుందని, అదే గణపతిని పూజించినట్లయితే సిద్ధి బుద్ధితోబాటు క్షేమం, లాభం కూడా కలుగుతాయని స్వయంగా పార్వతీ పరమేశ్వరులే గణపతికి వరం ఇచ్చినట్లు పురాణాలు చెబుతున్నాయి. అందుకనే ఏ కార్యాన్ని ప్రారంభించడానికయినా





ముందుగా గణపతిని పూజించి, ఆ తర్వాతనే ఆ పనిని మొదలు పెట్టడం ఆచారంగా వస్తోంది.

### వినాయకుడు వివాహితుడేనా?

**వినాయకుడు 'హస్తిముఖుడు',** హస్తమంటే తుండం. హస్తం (తుండం) కలిగింది హస్తి (ఏనుగు). ఈ రూపాన్ని చూస్తూ మనం గమనించాల్సింది ఈయన 'ఏనుగు ముఖం వా'డనే విశేషాన్ని కాదు. ఈయన జన్మనక్షత్రం 'హస్త' హస్తా నక్షత్రం కన్యారాశికి చెందింది కాబట్టి ఈయన్ని 'అవివాహితు'డన్నారు. అయితే లోకంలో వివాహం కానిదే కొన్ని కార్యాలకు అర్హత సిద్ధించదు కాబట్టి వినాయకునికి సిద్ధి, బుద్ధి అనేవారు భార్యలుగానూ, క్షేమం, లాభం సంతానంగానూ చెబుతారు.

### పత్రి పూజ వల్ల ప్రయోజనమేమిటి?

వినాయకుడిని పత్రితో పూజించడంలో కొన్ని రహస్యాలు ఇమిడి ఉన్నాయి. విఘ్నేశ్వర పూజకు మాచీపత్రి, ములక, మారేడు, గరిక, ఉమ్మెత్త, రేగుపత్రి, ఉత్తరేణి, తులసి, మామిడి, విష్ణుక్రాంత, దానిమ్మ, రేగు, దేవదారు, గన్నేరు, మరువం, వావిలి, జాజి, జమ్మి, రావి, మద్ది, జిల్లేడు. గణపతి పూజకు ఉపయోగించే ఈ 21 రకాల ఆకులూ ఓషధీ విలువలు కలిగినవి. ఈ ఔషధ రకాలకు చెందిన మొక్కలను తాకడం, వాటిని తుంచి సేకరించడం, వినియోగించడం వల్ల వాటిలో ఉండే ఓషధీ విలువలను మనం పొందగలం. తులసి, మారేడు, ఉత్తరేణి వంటి ఆకులను స్పర్శించడం వల్ల చర్మరోగాలు నశిస్తాయి. మెదడు ఉత్తేజితమౌతుంది.

### విశేష నాయకుడు:

అకారాన్నీ ఉకారాన్నీ మకారాన్నీ కలిపి 'ఓమ్' అనే ఓ మంత్రాన్ని సిద్ధం చేశారు దేవతలు. మొదటగా కన్పించిన విఘ్ననివారక దైవానికి ఈ వేదాలద్వారా ఏర్పాటు చేసిన ఓంకారాన్ని సంకేతంగా ఏర్పాటు చేశారు. 'ఓం'అనడమంటే వినాయకుణ్ణి ప్రార్థించినట్లన్నమాట. అందుకే అష్టోత్తర శతనామాలను పఠించబోయేముందు ప్రతినామానికీ ముందు ఓంకారాన్ని చేర్చారు. ఓంకారం లేకుండా నామాన్ని చదివితే ఆ నామానికి అక్షరతత్వమే ఉంటుంది తప్ప మంత్రత్వం సిద్ధించదన్నమాట. 'ఓమ్' అని పలికితే వినాయకుని నామాన్ని ఉచ్చరించినట్టూ, ఓమ్ అని పూజా ప్రారంభంలో మన పూజామందిరం ముందు రాస్తే వినాయకుని చిత్రాన్ని మనకొచ్చినంత నైపుణ్యంతో గీసినట్టూ ఔతుందన్నమాట.

### ఎలుక వాహనం ఏమి చెబుతోంది?

వినాయకుని వాహనం మూషికం. 'ముషస్తేయే' అనే ధాతువు మీద మూషకం లేదా మూషికమనే మాట ఏర్పడింది. దీనికి 'ఎలుక' అని అర్థం. ఎలుకని ఓసారి పరిశీలించండి%ో%ఎప్పుడూ చలిస్తూనే ఉంటుంది. ఏ క్షణమూ కూడ కదలకుండా ఉండనిదీ ఆ ప్రాణి. నిశ్చలంగా కూచున్నప్పుడు కూడ మూతినో కళ్లనో కదుపుతూనే ఉండే లక్షణం దానిది. ఇక రెండవది%–% ఎక్కడినుండో దొంగతనంగా తెచ్చి బొరియలో దాచిపెట్టుకునే లక్షణం దానిది. ఈ ఎలుక మీద వినాయకుడు ఉంటాడంటే ఎవరైనా సరే, దొంగబుద్ధితో దాచకు. అనుభవించకుండా నిలవ ఉంచుకోకు! చంచలత్వాన్ని నియంత్రించుకుని నిశ్చలతతో ఉంటే విఘ్నం నీ దరి చేరదు, విజయం నీ చెంత నుంచి వెనక్కు మళ్లదు అని సంకేతార్థం.

### పత్రి అంటే ఎందుకంత ప్రీతి?

వినాయకుడి జన్మరాశి అయిన కన్యారాశికి అధిపతి బుధగ్రహం. ఈయన ఆకుపచ్చగా ఉంటాడు కాబట్టి, వినాయకునికి పత్రిపూజ ఇష్టమని చెప్పవచ్చు. ఆయన ఆది నుంచి ప్రకృతి ప్రియుడు. గడ్డిజాతి మొక్కల ద్వారానే ఆయనకు అనలాసురుడి బాధ నుంచి ఉపశమనం లభించింది. అందుకే ఆయనకు గరిక అంటే ఇష్టం.

### పాలవెల్లి ఎందుకు..?

జ్యోతిస్సు అంటే గ్రహాలూ నక్షత్రాలూ. ఆ జ్యోతిస్సు ఆధారంగా ఏర్పడిన శాస్త్రమే జ్యోతిశ్శాస్త్రం. ఈ గ్రహాలూ నక్షత్రాలూ అన్నీ ఆకాశంలోనే ఉంటాయి కాబట్టే వినాయక చవితినాడు ఈ రహస్యాన్ని విశదీకరించేందుకే 'పాలవెల్లి' పేరిట వినాయకుని పైభాగంలో చతురస్రాకారంలో ఒక జల్లెడలాంటి అలంకారాన్ని వెదురుబద్దలతో ఏర్పాటు చేసి, వెలగ, బత్తాయి వంటి ఫలాలూ, కూరగాయలూ వేలాడదీస్తారు.

### బంకమట్టే ఎందుకు?

గణేశ పూజకు ఒండ్రుమట్టితో చేసిన వినాయకుడి ప్రతిమను ఉపయోగించడం ఎందుకంటే, వాగులు, నదులు, కాలువలు మొదలైన జలాశయాలన్నీ పూడికతో నిండి వుంటాయి. బంకమట్టికోసం ఆయా జలాశయాలలో దిగి, తమకు కావలసినంత మట్టిని తీయడం వల్ల పూడిక తీసినట్లవుతుంది. నీళ్లు తేటపడతాయి. అదీగాక మట్టిని తాకడం, దానితో బొమ్మలు చేయడం వల్ల మట్టిలోని మంచి గుణాలు ఒంటికి పడతాయి. ఒండ్రుమట్టిలో నానడం ఒంటికి మంచిదని ప్రకృతి వైద్యులు ఎప్పుడో చెప్పారు. పూజానంతరం ఆయా మట్టి విగ్రహాలను నీటిలో కలపడం వల్ల ఆయా పత్రాలలోని ఔషధగుణాలు సంతరించుకుంటుంది.

### నిమజ్జనమెందుకు?

భూమి నీటిలో నుంచి పుట్టింది. ఆ భూమితోనే అంటే బంకమట్టితో విగ్రహం చేసి, దానికి ప్రాణప్రతిష్ఠ, ధ్యానావాహనాది షోడశోపచార పూజలు చేసిన అనంతరం ఉద్వాసన చెప్పి, తిరిగి ఆ నీటిలోనే నిమజ్జనం చేయడం సంప్రదాయం. అలా ఎందుకంటే, భూమినుంచి పుట్టింది ఎంత గొప్పగా పెరిగినా, తిరిగి భూమిలోనే కలిసిపోతుందన్న సత్యాన్ని చాటేందుకే. దేనిమీదా వ్యామోహాన్ని పెంచుకోకూడదన్న నీతిని చెప్పేందుకే!


### వినాయకుణ్ణి పూజిస్తే నిజంగా విఘ్నాలు తొలగుతాయా?

'వి%–% విశేషంగా (ఎన్నడూ ముడిపడని రీతిలో), ఘ్న%–% పనిని ప్రారంభించిన వ్యక్తి శారీరక మానసిక ధైర్యాలని నాశనం చేసేది' (విశేషేణ కార్యసామర్థ్యం హంతీతి విఘ్నః) అని విఘ్న పదానికి అర్థం. మనం పూర్వజన్మల్లో చేసుకున్న పాపాల కారణంగా రావలసిన విఘ్నాలేమేమి వున్నాయో వాటన్నింటినీ తొలగించగల శక్తి ఏ భగవంతుడికీ లేదు. అలాగే తొలగింపజేయగలిగిన వాళ్లయితే ప్రతివాళ్లూ నిత్యం పూజా పురస్కారాల్లో మునిగి అసలు విఘ్నాలే రాకుండా చేసేసుకునేవాళ్లు. అప్పుడు తాము లోగడ చేసిన పాపాలకి శిక్ష అనేది లేకుండానే పోయేది కూడా. ఇది లోక రక్షణ వ్యవస్థకి విరుద్ధం.

### మరి వినాయకుడేం చేస్తాడంటే..

ఆయన్ని ప్రార్థించిన పక్షంలో 'సర్వవిఘ్న ఉపశాంతయే...' రావలసిన విఘ్నాలంటూ మనకేం ఉన్నాయో, ఆ విఘ్నాలు మనకి సంప్రాప్తించిన వేళ మానసిక ఉపశాంతిని ఇచ్చి జీవితం మీద విరక్తి రానీయకుండానూ, కొత్తధైర్యంతో ముందుకి అడుగు వేసేలానూ చేస్తాడన్నమాట. అంటే విఘ్నమనేది కాలానికి సంబంధించింది కాబట్టి, ప్రతి వ్యక్తికీ ఒక్కొక్క కాలంలో జీవితదశలో వచ్చేది కాబట్టి ఆ కాలాన్ని తన అధీనంలో ఉంచుకున్న విఘ్ననాయకుణ్ణి ప్రార్థించి విఘ్నాలనుండి దూరం కావలసింది గానూ, ఒకవేళ విఘ్నమే తప్పనిసరై వస్తే తట్టుకోగలిగిన మానసిక స్థైర్యాన్ని ఈయనని ప్రార్థించడం ద్వారా పొందవలసిందిగానూ ఈ పండుగ మనకి చెప్తుంది

# హైదరాబాద్ పబ్ లలో డ్రగ్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ లోని పబ్బుల్లో మరోసారి డ్రగ్స్ కలకలం సృష్టించాయి. జూబ్లీహిల్స్, శేరిలింగంపల్లిలోని ఐదు పబ్బులు, క్లబ్బులలో ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. మొత్తం 33 మంది అనుమానితులకు డ్రగ్ డిటెక్షన్ కిట్స్‌తో పరీక్షలు నిర్వహించగా.. నలుగురికి పాజిటివ్ వచ్చినట్లు అధికారులు తెలిపారు. జూబ్లీహిల్స్ లోని బేజీలోన్ పబ్, శేరిలింగంపల్లిలోని కోరం క్లబ్ సహా మొత్తం ఐదు పబ్ లలో అధికారులు సోదాలు చేశారు.పరీక్షల్లో డ్రగ్స్ తీసుకున్నట్లు తేలిన నలుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వారికి డ్రగ్స్ ఎక్కడి నుంచి వచ్చాయి.. ఎవరు అమ్మారనే వివరాలు రాబట్టేందుకు ప్రశ్నిస్తున్నారు. డ్రగ్స్ తీసుకున్న వారు దొరికిన పబ్ లను అధికారులు సీజ్ చేశారు. వాటి యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.